సాక్షి చిత్తూరు

శుక్రవారం । 19 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్‌సీపీలోకి వలసలు

జిల్లావ్యాప్తంగా వైఎస్సార్‌సీపీలోకి గురువారం ఇతర పార్టీల నుంచి నేతలు చేరారు. - 8లో



ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌ను గురువారం జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ విడుదల చేశారు. - 8లో



చిత్తూరు @ 40

జిల్లాలో ఎండలు మండుతున్నాయి. గురువారం గరిష్టంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

నేడు పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి నామినేషన్లు





పుంగనూరు : వైఎస్సార్‌సీపీ పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి శుక్రవారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. స్థానిక హనుమంతరాయునిదిన్నెలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో పెద్దిరెడ్డి ముందుగా పూజలు నిర్వహించనున్నారు. అక్కడి నుంచి రామసముద్రం రోడ్డు, ఎన్‌ఎస్ పేట, పుంగమ్మ చెరువు కట్ట, బ్రాహ్మణవీధి, సెంటర్ లాడ్జి, నాగపాళ్యెం, ఇందిరా సర్కిల్ మీదుగా గోకుల్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టనున్నారు. అలాగే ఎంపీ మిథున్‌రెడ్డి తరపున సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జి ఫక్రుద్దీన్‌షరీఫ్ ఆధ్వర్యంలో ముస్లింలు రాయచోటికి వెళ్లి నామినేషన్ దాఖలు చేయనున్నారు.

నెలాఖరుకు వర్క్ ఆర్డర్లు క్లోజ్



మాట్లాడుతున్న అకౌంట్స్ అధికారి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలోని ఏఈలు పెండింగ్‌లో ఉండే వర్క్‌ఆర్డర్లను ఈనెలాఖరులోపు క్లోజ్ చేయాలని సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఈఈ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్క్‌ఆర్డర్ల పై ప్రతినెలా గడువు ఇస్తున్నా ఏఈల తీరులో మార్పు రాలేదన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకుని పనులు క్లోజ్ చేయాలని సూచించారు. డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ని రూ.5 కోట్ల ప్రైవేటు సర్వీసుల మొండి బకాయిలను వసూలు చేయాలని స్పష్టం చేశారు. సంబంధిత సర్వీసులకు విద్యుత్ సరఫరా తొలగించినా, డబ్బులు సంస్థకు చెల్లించేలా కృషి చేయాలన్నారు. ప్రతినెలా 7వ తేదీలోపు వినియోగదారులకు విద్యుత్ బిల్లులను అందజేయాలని ఆదేశించారు. వందశాతం బిల్లుల వసూలుకు కృషి చేయాలని కోరారు. సెక్షన్ల పరిధిలో అదనపులోడ్ సర్వీసులను గుర్తించి క్రమబద్ధీకరణ చేయించాలని సూచించారు. సమావేశంలో ఈఈ పద్మనాభపిళ్లై, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, జేఏఓ గోవిందరాజులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం రేపు

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా శనివారం జెడ్పీ 1–7 స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ గ్లోరియా గురువారం తెలిపారు. ఆ రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సమావేశం ఉంటుందన్నారు. తాగునీటి సమస్య, వైద్య ఆర్యోగశాఖ అంశాల పై సమీక్షించనున్నట్లు వెల్లడించారు. జెడ్పీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

మీకు తెలుసా..?

నామినేషన్ తిరస్కరణకు గురైతే డిపాజిట్ వాపస్!



అభ్యర్థి నామినేషన్‌లు దాఖలు చేసిన తర్వాత పరిశీలన అనంతరం తిరస్కరణకు గురైతే డిపాజిట్‌ను తిరిగి చెల్లిస్తారు. అయితే ఈ సెక్యూరిటీ డిపాజిట్‌ను వెంటనే చెల్లించరు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత సదరు అభ్యర్థికి అందజేస్తారు. ఇందుకోసం రిటర్నింగ్ అధికారికి వినతి పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. నామినేషన్‌ను ఉపసంహరించుకుంటే మాత్రం డిపాజిట్‌ను వెంటనే చెల్లిస్తారు. – చిత్తూరు కలెక్టరేట్





పలమనేరులో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ర్యాలీ



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, అభివాదం చేస్తున్న వెంకటేగౌడ

సమరానికి సై

జనసంద్రంగా మారిన వీధులు.. వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు.. మద్దతు పలుకుతూ పెద్దసంఖ్యలో బారులు తీరిన ప్రజలు.. దశదిశలా మార్మోగిన జై జగన్ నినాదాల నడుమ వైఎస్సార్‌సీపీ పలమనేరు, చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థులు వెంకటేగౌడ, విజయానందరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తొలిరోజే సమరానికి సై అంటూ బరిలో దిగారు. ఈ సందర్భంగా వెంకటేగౌడను అఖండ మెజారిటీతో గెలిపించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోరారు. విజయానందరెడ్డిని ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని విన్నవించారు.

- తొలిరోజు జిల్లాలో మొత్తం 15 నామినేషన్ల దాఖలు
- అట్టహాసంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్లు
- భారీ సంఖ్యలో తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్పతో కలసి విజయానందరెడ్డి, మంత్రి పెద్దిరెడ్డితో కలసి వెంకటేగౌడ నామినేషన్

సాక్షి, చిత్తూరు/చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే గురువారం జిల్లాలో నామినేషన్‌ల పర్వం మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని చిత్తూరు పార్లమెంట్ స్థానం, జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాలకు కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. రిటర్నింగ్ అధికారులు ఆయా ఆర్‌ఓ కార్యాలయాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్‌లు స్వీకరించారు.

జన ప్రవాహమే..!

నామినేషన్ ఘట్టానికి జనప్రవాహంలా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంసీ విజయానందరెడ్డి తెలిపారు. ఎండను సైతం లెక్కచేయకుండా ర్యాలీలో పాల్గొన్నారని ఆనందం వ్యక్తం చేశారు. అభిమానం చూపిన ప్రజలకు రుణపడి ఉంటానని చెప్పారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మేలు చేశారన్నారు. మరోసారి ఆయనను సీఎంగా చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ ఎన్నికల తర్వాత టీడీపీ నామరూపాలు లేకుండా పోతుందని స్పష్టం చేశారు. కుప్పంలో సైతం చంద్రబాబు ఓడిపోవడం ఖాయమని వెల్లడించారు.

తొలిరోజు 15 నామినేషన్‌లు దాఖలు....

జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో నామినేషన్‌ల పర్వం సాగింది. తొలిరోజు 15 నామినేషన్‌లు దాఖలయ్యాయి. చిత్తూరు పార్లమెంట్ స్థానానికి టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు కలెక్టరేట్‌లో ఆర్‌ఓ షణ్మోహన్‌కు ఒక సెట్ నామినేషన్ అందించారు. పుంగనూరు నియోజకవర్గంలో చల్లా రామచంద్రారెడ్డి (టీడీపీ), చల్లా పూజారెడ్డి (టీడీపీ), జి.మురళిమోహన్ (కాంగ్రెస్), కందడి షేక్ అన్వర్ భాషా (సోషియల్ డెమోక్రటిక్ పార్టీ), నగరిలో జి.భానుప్రకాష్ (టీడీపీ), గంగాధరనెల్లూరు లో ఉసురుపతి పద్మనాభం (ఇండిపెండెంట్), రత్నవేల్ గాంధీ (టీడీపీ), చిత్తూరు అసెంబ్లీకి ఎంసీ విజయానందరెడ్డి (వైఎస్సార్‌సీపీ-3 సెట్లు), జీసీ జగన్‌మోహన్ (టీడీపీ-2 సెట్లు), పలమనేరులో ఎన్.వెంకటేగౌడ (వైఎస్సార్‌సీపీ), పావని (వైఎస్‌ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి) నామినేషన్ వేశారు. కుప్పం, పూతలపట్టు నియోజకవర్గాల్లో తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

చిత్తూరులో..

విజయానందరెడ్డి నామినేషన్ వేసేందుకు నగరంలోని గంగినేని చెరువు నుంచి విజయా డెయిరీ వరకు ర్యాలీగా వచ్చారు. పెద్దసంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితో కలిసి విజయానందరెడ్డి జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ సమర్పించారు.

పలమనేరులో..

వైఎస్సార్‌సీపీ పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్. వెంకటేగౌడ సుమారు 10వేల మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఓంశక్తి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఆయన సతీమణి పావని కూడా మరో సెట్ నామినేషన్‌ను సమర్పించారు. అనంతరం ఓంశక్తి ఆలయం నుంచి టవర్ క్లాక్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు అఖండ విజయం చేకూర్చాలని పిలుపునిచ్చారు.





ర్యాలీగా వస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు రెడ్డెప్ప, మోహిత్‌రెడ్డి, విజయానందరెడ్డి, ర్యాలీకి హాజరైన ప్రజలు



నామినేషన్ సమర్పిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

అభివృద్ధి.. సంక్షేమమే అజెండా



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి భరత్

- కుప్పంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం
- భరత్‌ను గెలిపించి ముఖ్యమంత్రికి కానుక ఇద్దాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

శాంతిపురం: కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి.. సంక్షేమమే అజెండాగా ముందుకు వెళుతున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం శాంతిపురం, రామకుప్పం మండలాల పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ కుప్పం భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ ఇచ్చిన మాట ప్రకారం హంద్రీ–నీవా కాలువ ద్వారా నీరందించారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు కాలువను ప్రారంభించాక వచ్చి ఎల్లో మీడియా ద్వారా అబద్ధాలు వల్లించి వెళ్లారని మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో కుప్పం ప్రజలు అంచనాలకు మించి వైఎస్సార్‌సీపీ అండగా నిలిచారని, ఇదే ఒరవడిని కొనసాగిస్తూ భరత్‌ను సైతం గెలిపిస్తారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు మరో 20 రోజులు శ్రమిస్తే భరత్ గెలవడం, మంత్రి కావడం సులువుగా జరిగిపోతాయని చెప్పారు. ప్రతి కార్యకర్తకు అండగా నిలిచి, వారిని కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు.

సీమ ద్రోహి చంద్రబాబు


చంద్రబాబు తాను పుట్టి, పెరిగిన రాయలసీమకు తీరని ద్రోహం చేశారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. ఓటుకు కోట్లు కేసు కోసం ఉమ్మడి రాజధాని హైదరాబాద్, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేసి, ప్రతి కుటుంబానికి మేలు చేసి, తన ఐదేళ్ల పాలనలో మంచి జరిగి ఉంటేనే తనకు ఓటు వేయాలని చెప్పిన దమ్మున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని వివరించారు. ఈ మాట చెప్పే ధైర్యం 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబుకు ఉందా ? అని ప్రశ్నించారు. అది లేకనే సూపర్ సిక్స్, బాబు గ్యారెంటీ అంటూ మళ్లీ మోసం చేసేందుకు వస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ మాట్లాడుతూ గతంలో నామినేషన్ వేయడానికి, ఓట్లు అడగడానికి కూడా కుప్పానికి రాకుండా చంద్రబాబు ఓటర్లను అవమానించారని విమర్శించారు. ఇప్పుడు ఓటమి భయంతోనే కుప్పం బాట పడుతున్నారని ఆరోపించారు. 35 ఏళ్లుగా పట్టించుకోని వ్యక్తి మళ్లీ అవకాశం ఇస్తే ఐదేళ్లలో అభివృద్ధి చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కుప్పం రాజకీయ చరిత్రను తిరగరాసేందుకు పార్టీ శ్రేణులతో కలిసి కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, నియోజకర్గ పరిశీలకుడు మొగసాల రెడ్డెప్ప, నాయకులు మొగసాల కృష్ణమూర్తి, భూపేష్ గోపీనాథ్, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు శ్రీనివాసులు, నితిన్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు బుల్లెట్ దండపాణి, విజలాపురం బాబురెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు చంగప్ప, పెద్దన్న, కృష్ణమూర్తి, సుబ్బరాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను గురువారం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గురించి సీఐ లక్ష్మయ్యను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి సిబ్బందికి తెలియజేశారు. పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు తలెత్తితే తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. బైండోవర్లు, రౌడీషీటర్లు, అనుమానితులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎంసీసీ కోడ్‌కు సంబంధించి చేపట్టాల్సిన చర్యలను గురించి సిబ్బందికి సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సిబ్బంది సంసిద్ధంగా ఉండాలన్నారు.



క్లుప్తంగా

రెండు ద్విచక్ర వాహనాల ఢీ : ఇద్దరి మృతి

గంగాధర నెల్లూరు: మండలంలోని నెల్లేపల్లి వద్ద గురువారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. వివరాలు.. జీడీ నెల్లూరు మండలం వరదరాజపురం గ్రామానికి చెందిన చిన్నబ్బ(55) బైక్‌పై కొత్తపల్లి మిట్ట నుంచి జంగాలపల్లి వెళుతుండగా, చిత్తూరు నుంచి బైక్‌పై శ్రీరంగరాజపురం మండలం కొత్తపల్లి మిట్టకి వస్తున్న గణేష్ (28) ఢీకొన్నారు. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోడను ఢీకొన్న కారు : బాలుడి మృతి

శ్రీరంగరాజపురం : మండలంలోని నెలవాయి వద్ద చిత్తూరు– పుత్తూరు జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. వివరాలు.. ఎస్ఆర్ పురం వడ్డిగుడిసెలు గ్రామానికి చెందిన పెద్దబ్బ కుమారుడు గగన్ (7)ను తీసుకుని బాలుడి మామయ్య బుజ్జి బాబు కారులో తిరుపతికి వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కన సిమెంట్ గోడను ఢీకొట్టాడు. దీంతో గగన్ అక్కడికక్కడే మరణించాడు. గాయపడిన బుజ్జిబాబును 108లో చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు కుళ్లాయప్ప తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ

- పుంగనూరులో దాదాపు టీడీపీ ఖాళీ
- మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో భారీగా చేరికలు

పుంగనూరు : జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీలోకి ఇతర పార్టీల నుంచి వలసలు వెల్లువెత్తుతున్నాయి. అందులో భాగంగా గురువారం పుంగనూరుకు చెందిన పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్న సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ పసుపుల కేశవమూర్తి, ఆయన సతీమణి, మాజీ కౌన్సిలర్ ఆనంతలక్ష్మీతో సుమారు 70 మందికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కౌన్సిలర్ రెడ్డెమ్మ, కిషోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాయల జగదీష్, ఎస్వీటీ కిషోర్‌ల ఆధ్వర్యంలో పసుపుల కుటుంబాలకు చెందిన బలిజ సామాజిక వర్గానికి చెందిన వారు పార్టీలో చేరడంతో తెలుగుదేశం నేతలు షాక్‌కు గురయ్యారు. అలాగే నక్కబండకు చెందిన హైదర్ ఆధ్వర్యంలో 40 మంది ముస్లిం మహిళలు టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ క్రమంలోనే మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆవుల అమరేంద్ర ఆధ్వర్యంలో కట్టకిందపాళ్యానికి చెందిన మనోహర్, రెడ్డెప్ప, బాలు, శంకర, పవన్‌కల్యాణ్‌తో పాటు 20 మంది టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ కేశవమూర్తి కుటుంబం రాకతో పార్టీ మరింత బలోపేతమైందన్నారు. ఆయనకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని, పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. కేశవమూర్తి మాట్లాడుతూ 30 ఏళ్లలో ఎన్నడూ జరగని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ ఐదేళ్లలోనే జరిగిందని వెల్లడించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిలర్ ముత్తంశెట్టి విశ్వనాథ్, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, బలిజ సంఘ నాయకులు ప్రభాకర్, మల్లికార్జున , రమణ, హరీష్, రెడ్డెప్ప పాల్గొన్నారు.



పుంగనూరులో పసుపుల కేశవమూర్తిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



గణేష్‌యాదవ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో చేరిన గణేష్‌యాదవ్

పలమనేరు : నియోజకవర్గంలో కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలను చేపడుతూ ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగాలని భావించిన రియల్టర్ గణేష్‌యాదవ్ తన అనుచరులతో కలసి వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గణేష్ యాదవ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని, జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి ఆశీస్సులతో పలమనేరులో వైఎస్సార్‌సీపీ జెండాను మళ్లీ ఎగురవేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి ఆకుల గజేంద్రప్రసాద్, చలపతి రెడ్డి పాల్గొన్నారు.



పార్టీలో చేరిన నక్కబండకు చెందిన ముస్లింలతో మంత్రి పెద్దిరెడ్డి

ఆర్ఎంపీల చేరిక

కుప్పం: నియోజకవర్గంలోని ఆర్ఎంపీ అసోసియేషన్ సభ్యులు 20 మంది వైఎస్సార్ సీపీ చేరారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయ ప్రాంగణంలో వారికి మంత్రి పెద్దిరెడ్డి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రెడ్డెప్ప, భరత్ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు.



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న ఆర్ఎంపీలు

సొంతగూటికి చేరిన రమాదేవి



రమాదేవితో చంద్రశేఖర్‌రెడ్డి, శైలజాచరణ్‌రెడ్డి

ఐరాల: తవణంపల్లె మండలం ఉత్తరబ్రాహ్మణపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత రమాదేవి తిరిగి సొంతగూటికి చేరారు. గురువారం మండలంలోని ఎం.పైపల్లె వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ అదనపు పరిశీలకులు శైలజాచరణ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు సుచిత్ర సమక్షంలో ఆమె పార్టీలో చేరారు. రమాదేవి మాట్లాడుతూ 2014 నుంచి వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా పనిచేశామన్నారు. 2019 ఎన్నికల్లో టికెట్ రాకపోవడంతో మనస్తాపం చెంది పార్టీకి దూరమైనట్లు వెల్లడించారు. అయితే టీడీపీ నాయకులు ఎంతగా ప్రలోభాలకు గురిచేనా అటు వైపు వెళ్లలేదన్నారు. వైఎస్సార్‌సీపీ పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ పిలుపు మేరకు సొంతగూటికి రావడం ఆనందంగా ఉందని వివరించారు.



పార్టీలో చేరిన నేతలతో మంత్రి రోజా

కాంగ్రెస్ నేతల చేరిక

నగరి : నిజాయితీగా ఉన్నారు.. పేదలకు మంచిచేస్తున్నారు నిండుమనసుతో మీవెంట వచ్చేస్తున్నాం అంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం నగరి దళితవాడ నుంచి 40 మంది కాంగ్రెస్ వారు వైఎస్సార్‌సీపీ నేత అముద ఆధ్వర్యంలో మంత్రి ఆర్‌కే రోజా కార్యాలయం పార్టీలో చేరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిలో కాంగ్రెస్ నేత జాన్, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్, సుకుమార్, ఆనంద్ రాజ్, పరమానందం, మారన్, ప్రతాప్, లారెన్స్, అభిషేక్, ప్రతాప్, ఏసు, ప్రసిల్లా, సెల్వి, సంపూర్ణ, జ్యోతి, దయానిధి, జాయిస్ తదితరులు ఉన్నారు. వీరికి మంత్రి రోజా కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన నేతలు మాట్లాడుతూ ప్రస్తుతం పేదల పాలిట సువర్ణ యుగం నడుస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఎలాంటి సిఫార్సులు లేకుండా అన్నీ అందుతున్నాయని వెల్లడించారు. గతంలో టవర్‌క్లాక్ సెంటర్ వద్ద పనిచేసే కూలీలకు సమయం తెలుసుకోవాలన్నా వీలుపడేది కాదన్నారు. మంత్రి రోజా రూ.3 లక్షల సొంత నిధులతో టవర్ క్లాక్‌ను మరమ్మతులు చేయించారని వివరించారు. మేము చేసిన అభివృద్ధి ఇది.. మేము అమలు చేసిన సంక్షేమం దానికి వెచ్చించిన నగదు ఇది అంటూ నిజాయితీగా ప్రజలకు చూపించి ఓటు అడుగుతున్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని కొనియాడారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

– జూన్ 6 వరకు కోడ్ అమలు



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్‌ను జిల్లాలోని ఆయా నియోజకవర్గాల ఆర్‌ఓలు ప్రచురించారు. గురువారం ఉదయం ఆయా ఆర్‌ఓల కార్యాలయాల్లో నోటిఫికేషన్ విడుదల చేసి వివరాలు వెల్లడించారు. కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాదల ఆదేశాల మేరకు ఎన్నికలను పకడ్బందీగా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మే 13న ఎన్నికల పోలింగ్ ఉంటుందన్నారు. జూన్4 ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందన్నారు. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ జిల్లా వ్యాప్తంగా అమలులో ఉంటుందని వెల్లడించారు.

పకడ్బందీగా నామినేషన్ల ప్రక్రియ

జిల్లాలో పకడ్బందీగా నామినేషన్‌ల ప్రక్రియ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. చిత్తూరు ఆర్డీఓ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతి రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ముందుగా వచ్చే అభ్యర్థి నామినేషన్‌ను పరిశీలిస్తామని చెప్పారు. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు నలుగురిని అనుమతిస్తామని వివరించారు. అభ్యర్థులు నామినేషన్‌లను నేరుగా ఆర్‌ఓలకే అందజేయాలని సూచించారు. అభ్యర్థులు అందజేసే అఫిడవిట్‌ను ఈసీ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని, ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులకు ఏ సమస్య ఉన్నా నేరుగా ఆర్‌ఓల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. ఈ నెల 29న పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు. ఏడు కేటగిరీలలో ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులందరూ పోస్టల్‌బ్యాలెట్ కోసం సంబంధిత హెచ్‌ఓడీ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మే 3వ తేదీ తర్వాత పోస్టల్ బ్యాలెట్ పేపర్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 29న సప్లిమెంటరీ ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామని వివరించారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎన్నికల ప్రచార వాహనం బోల్తా

– ఐదుగురికి తీవ్రగాయాలు



గుడిపాల : జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రూపేష్‌కు టీడీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ ఎన్నికల్లో ప్రచారం చేసేందుకు ఓ ఇన్నోవా కారును అందజేశారు. అందులో ప్రతిరోజు కొంతమంది యువకులను వెంటబెట్టుకొని రూపేష్ ప్రచారం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 197రామాపురం మార్గంలో అతివేగంగా కారణంగా కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మొత్తం ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఏఎల్‌పురం వడ్డియిండ్లకు చెందిన చిరంజీవి(26, ఖైదుగానికండ్రిగకు చెందిన ఆదికేశవులు(55), కొత్తకోట హరిజనవాడకు చెందిన సంతోష్(27), కిల్లారిపల్లెకు చెందిన డ్రైవర్ దాము(50)తో పాటు రూపేష్(33) గాయపడ్డారు. క్షతగాత్రులందరూ చీలాపల్లె వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవరత్నాలు గిర్ర్‌ర్ర్... సూపర్ సిక్స్ తుర్ర్‌ర్ర్



ఏమబ్బా! ఆయన ఎమ్మెల్సీ శ్రీకాంత్ ఇదేమన్నా ప్రకాశం..ఒంగోలు అనుకున్నాడా ఏందీ? కార్యకర్తలను ఓ అని సతాయిస్తావుండాడే. ఎలక్షన్లు అందరికీ తెలుసూ. చంద్రబాబు చెప్పిన సూపర్ సిక్స్ పథకాల హామీల గురించి జెనాలకు చెబుతావుంటే వాళ్లినాలి కదా! వాటి గురించి జెనాలకు చెప్పండా.. చెప్పాండా.. అని శ్రీకాంత్ అంటావుండారు..జెనంలో అయితే రెస్పాన్సు లేదప్పా.. మొన్న మావూర్లో ప్రచారం చేస్తిమా...చంద్రబాబును గెలిపిచ్చి సీఎం చేస్తే తల్లికి వందనం కింద 20 వేలు ఇస్తారని చెప్తిమా..ఆయమ్మ ఏమనిందో గుర్తుంది కదా!?.. మాకు అమ్మఒడి కింద జగనన్న 15 వేలిస్తాండాడు..అని నవ్వాతా చెప్పి తలుపేసుకుని ఇంట్లోకి ఎల్లిపాయె. జనాలు ముందు మాదిరిగా లేదప్పా .. చాలా హుషారుగా ఉండారు..జగనను ఎన్నో ఇస్తాండాడు.. ఇప్పుడు ఆయన పథకాలకు పేర్లు మార్చి, ఇంక కొత్తగా మీరిచ్చేదేందప్పా? అని అడోళ్లు ముకానే అడగతాండారు. ఆ మాదిరి చెప్తే తలకాయ యాడబెట్టుకోవాల? జెనం మైండులో జగను పథకాలే తిరగతాండాయప్పా.. సూపర్ సిక్స్ లేదప్పా..ఈ శ్రీకాంతు సారేమో జెనాలకు చంద్రబాబు పథకాల గురించి చెప్పండా.. చెప్పండా.. అని చాలా ఇబ్బంది పెడుతావుండాడు. అన్నదాత కింది చంద్రబాబు 20 వేలు ఇస్తాడని ఊళ్లో జెనాలకు పాంప్లేట్ ఇస్తే..మాకు రైతు భరోసా వస్తాందిలే అని ఆడోళ్లే చెప్తాండారు. జగన్ మోహన్‌రెడ్డి తైక్కుమంటే చాలు..పుసుక్కుమని బటను నొక్కి పథకాల డబ్బులు ఎన్నోసార్లు వేసి ఉండాడు.. అందుకే ఆడోళ్లు, మగోళ్ల మైండ్లలో జగను పథకాలన్నీ గిర్ర్‌ర్ర్‌ర్ర్..మని ఫ్యానులాగ తిరగతాండాయప్పా..మనవేమో తుర్ర్‌ర్ర్‌మంటాడాయప్పా..చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఏ బటనూ నొక్కలా..! జన్మభూమి కమిటీలు చెప్పినోళ్లకే ఇచ్చినారు..అదే పెద్ద మైనస్సప్పా.. మనం ఏం జెప్పినా చంద్రబాబు కన్నా ఇప్పటి ప్రభుత్వమే బాగా చేస్తాందని ఓటర్లు చెప్పేస్తాండారప్పా.. జగన్ పార్టీ కూడా స్ట్రాంగైంది.. విలేజీల్లో ముందు మాదిరిగా లే..మన లీడర్లకు ఇది చెబితే పట్టించుకోరు.'' భువనేశ్వరి వచ్చి నామినేషన్ వేసినా ఇంతేప్పా.. అని నిట్టూర్చారు తెలుగు తమ్ముళ్లు. టీడీపీ కార్యాలయం మీటింగ్ అయినా తరువాత నలుగురు కార్యకర్తల మధ్య బస్టాండులో పిచ్చాపాటీగా సాగిన సంభాషణ ఇది. ప్రజల్లో వైఎస్సార్ సీపీ పథకాలు ఎంత బలంగా ఉన్నాయో, వాటి ప్రభావం ఎంతగా ఉందో ఈ సంభాషణ చెప్పకనే చెప్పింది.

–కుప్పం

చిత్తూరు @ 40

చిత్తూరు కలెక్టరేట్: మండే ఎండలతో జిల్లా నిప్పుల కొలిమిని తలపిస్తోంది. వడగాలులకు జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. చిత్తూరులో గురువారం అత్యధికంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే రోజుల్లో ఎండలు మరింత తీవ్ర రూపం దాల్చుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది.

ఉక్కపోత

మండే ఎండలు, వడగాల్పులతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రతతో పాటు ఉక్క పోత మొదలవుతోంది. ఇక మధ్యాహ్నం నుంచి 3 గంటల వరకు తీవ్ర ఎండలు నమోదవుతున్నాయి. సూర్యుడు నిప్పులు కక్కుతూ దూసుకొస్తున్నాడు. జనం వీధిలోకి రావడానికి భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎన్నికల సిబ్బంది సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.